

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 303 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 05, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అధికార బానిసత్వం!




వ్యవస్థల నాశనానికి కారకులు ఎవరు

సాంకేతిక సమాజంలో అధికార వ్యక్తిత్వం బానిస అవుతుంది

అగ్రవర్ణాల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్న బహుజన అధికారులు

గులాంగిరి ఒకటే మార్గంగా పదవులపై దాహం పెంచుకుంటున్నారు

సొంత సామాజిక వర్గాలను సర్వనాశనం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు

వ్యవస్థలు ఏవైనా అధికార దాహంతో రగిలిపోతున్నారు.. ప్రభుత్వానికి బానిసత్వంగా అధికార యంత్రాంగం.

అధికార దుర్వినియోగం ప్రతి చోట ఆదర్శవంతంగా కనపరుస్తున్నారు

అధికార దుర్బలం “పై” అధికారుల”పై” ప్రభావం చూపడం లేదు

“పై” అధికారులకు పైసలు దోచిపెట్టడంలో మనోల్లను మించిన మొనగాళ్లు లేరు

డాక్టర్ బరిగెల శివ

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



అధికార పదవులపై మోజు, రాజకీయ ఒత్తిళ్లు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజీపడే ధోరణి ప్రభుత్వ వ్యవస్థలను బలహీనపరుస్తోందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. ముఖ్యంగా అణగారిన, బహుజన వర్గాలకు చెందిన అధికారులు తమ పదవులను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాల్సింది పోయి ఉన్నతాధికారులు, రాజకీయ శక్తుల ఒత్తిళ్లకు లోబడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, ప్రభుత్వ వ్యవస్థల రక్షణ కంటే పదవులను కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

- హైదరాబాద్, (జై భీమ్ డెస్క్)

2

## మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నారు: కవిత

కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం

కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ హామీ ఏమైంది?

నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

కరవు బాధితులకు అండగా ఉంటామని హామీ



2

## ఆర్టీఐ యాక్ట్ రాష్ట్రస్థాయి కార్యక్రమానికి గవర్నర్‌కు ఆహ్వానం



3

గవర్నర్ ప్రతాప్ శుక్లాను కలిసిన రాష్ట్ర సమాచార కమిషనర్లు

అక్టోబర్ 9న రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం

సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహణ

సమాచార హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం

పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే దిశగా కార్యక్రమం

## కేబుల్ టీవీ అక్రెడిటేషన్లపై అనుమానాల మేఘం.. అసలు లెక్కలేంటి?

అక్రెడిటేషన్ వెనుక అసలు కథేంటి?

గత లెక్కలెంత.. తాజా గుర్తింపులెన్నింటికి?

అర్హతలు, పత్రాల పరిశీలన జరిగిందా?

డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్

ఎవరు పరిశీలించారు.. ఎవరు సిఫార్సు చేశారు.. ఎవరు ఆమోదించారు?

3



## ఇక ఆటోల వంతు.. కామన్ పాస్‌పై సర్కార్ కీలక ప్రకటన

త్వరలో కామన్ పాస్ పరిధిలోకి ఆటోలు

ఒకే కార్డుతో ప్రజా రవాణా అనుసంధానమే లక్ష్యం

మెట్రో, బస్సుల్లో కామన్ పాస్ పనితీరుపై పరిశీలన

పాస్ ధరలపై సమీక్ష చేస్తామని మంత్రి పొన్నం హామీ

నెలవారీ పాస్ ధరపై ప్రయాణికుల నుంచి మిశ్రమ స్పందన



2

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నారు: కవిత

**కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం**
**కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్**
**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ హామీ ఏమైంది?**
**నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం**
**కరవు బాధితులకు అండగా ఉంటామని హామీ**

హైదరాబాద్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్) :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళ్తున్నాయని, అయితే మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపైనా శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నందున ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలోనూ కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ వైఖరిని తెలియజేస్తోందన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే ప్రస్తుతం దాన్ని నింపి కల్వకుర్తి ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉండేదని, తద్వారా భూగర్భ జలాలు కూడా పెరిగేవని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా తెలంగాణ నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం కేవలం ఆరు నుంచి ఏడు గంటల సరఫరాతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంతో పాటు హైదరాబాద్, ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత తెలిపారు.

# ఇక ఆటోల వంతు.. కామన్ పాస్‌పై సర్కార్ కీలక ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్) :

హైదరాబాద్ మహానగర ప్రయాణికులకు ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కామన్ మొబిలిటీ కార్డు (కామన్ పాస్) సేవలను త్వరలో ఆటోలకు కూడా విస్తరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం మెట్రో, ఆర్టీసీ బస్సులకు మాత్రమే పరిమితమైన కామన్ పాస్ పరిధిలోకి ఆటోలను కూడా తీసుకురావడం ద్వారా నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గురువారం కామన్ పాస్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మెట్రోలో, అక్కడి నుంచి సచివాలయం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ సాధారణ ప్రయాణికులతో మాట్లాడి పాస్ వినియోగం, సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజలకు సులభమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఒకే కార్డుతో అన్ని రకాల ప్రజా రవాణా సేవలను పొందేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆటోలు, ఇతర రవాణా సాధనాలను కూడా కామన్ పాస్‌తో అనుసంధానిస్తామని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రజా రవాణాను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్ రూ.400, నెలవారీ పాస్ రూ.8,500 ధరలపై ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను పరిశీలిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నెలవారీ పాస్ ధర అధికంగా ఉందన్న ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వారి సూచనలు, సలహాల ఆధారంగా పాస్ ధరలపై సమీక్ష జరుపుతామని హామీ ఇచ్చారు. రోజూ పరిమిత దూరం ప్రయాణించే తమకు నెలవారీ పాస్ ధర భారంగా ఉందని, ప్రస్తుతం అవుతున్న ఖర్చుతో పోలిస్తే ఇది రెట్టింపుగా ఉందని కొందరు ప్రయాణికులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

# నాచారం, హెచ్‌ఎంటీ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**సుమారు రూ.కోటి విలువైన పనులకు శ్రీకారం**
**సాయినగర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం**
**రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు**
**పలు కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం**
**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):

నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్లలో సుమారు రూ.కోటి విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్‌తో పాటు కౌండిన్య నగర్, భవానీనగర్, రాఘవేంద్ర నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాలనీల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్, అధికారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అధికార బానిసత్వం





**వ్యవస్థల నాశనానికి కారకులు ఎవరు**
**సాంకేతిక సమాజంలో అధికార వ్యక్తిత్వం బానిస అవుతుంది**
**అగ్రవర్ణాల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్న బహుజన అధికారులు**
**గులాంగిరి ఒకటే మార్గంగా పదవులపై దాహం పెంచుకుంటున్నారు**
**సొంత సామాజిక వర్గాలను సర్వనాశనం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు**
**వ్యవస్థలు ఏవైనా అధికార దాహంతో రగిలిపోతున్నారు**
**ప్రభుత్వానికి బానిసత్వంగా అధికార యంత్రాంగం.**
**అధికార దుర్వినియోగం ప్రతి చోట ఆదర్శవంతంగా కనపరుస్తున్నారు**
**అధికార దుర్బలం "పై" అధికారుల"పై" ప్రభావం చూపడం లేదు**
**"పై" అధికారులకు పైసలు దోచిపెట్టడంలో మనోల్లను మించిన మొనగాళ్లు లేరు**
**డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అణగారిన వర్గాల అధికార పదవి దాహమే అణాగారిన వర్గాల అభ్యున్నతి అణిచివేతకు కారణమవుతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నప్పుడు రాజకీయ వర్గాల మధ్య ఏర్పడిన వైరుధ్యాలను ప్రజలు గాని ప్రభుత్వ వ్యవస్థలు గాని ప్రభుత్వ ఉన్నతాధికారులు గాని పెద్దగా పట్టించుకోకపోయేవారని ప్రజాసంక్షేమాల కొరకు పనిచేయాలనే ఆలోచన ప్రతి అధికారికి క్షేత్రస్థాయిలో ఉండేది అన్నారు.రాజకీయ పార్టీల మధ్య ఎన్ని గొడవలు ఉన్న అభివృద్ధి అనేది ప్రధాన అజెండాగా పెట్టుకొని ముందుకు సాగేవారని రాజకీయ పరస్పర సహకారంతో ప్రజల బాగోగులు చూసుకునేవారని గుర్తు చేశారు.అధికార పదవులు మనుషుల వ్యక్తిత్వాలను దిగజార్చడమే కాకుండా బానిసలుగా తయారు చేస్తుందని తెలపడానికి వేల ఉదాహరణలు తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా అభ్యున్నతి కన్నా బానిసత్వ విలువలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అనేది దినదినం పెరిగిపోతుందని అందువల్లనే ప్రతి ప్రభుత్వ వ్యవస్థ దిగజారిపోయే స్థితికి చేరువైందని గుర్తు చేశారు.తెలుగు రాష్ట్రాల్లో 90 శాతం కలిగిన బహుజనులు అణగారిన వర్గాలేనని వాళ్లందరినీ నాశనం చేయడం కోసం ప్రభుత్వాలు వాడుతున్న అదనాతనమైన (పరికరాలు) ప్రయత్నాలు అణగారిన వర్గాల అధికారులను అధికార పదవుల్లో కొనసాగించడం వాళ్ల ద్వారా వ్యవస్థలను నాశనం చేయడం వాటిని రాజకీయ పార్టీలు కొత్త ట్రెండులాగా భావిస్తుండడం విశేషం అన్నారు.

**దిగజారుడుతనం దరిద్రం..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బానిసత్వపు అధికార వ్యవస్థ ఎక్కువగా పెంచి పోషించబడిందని దానికి ప్రధాన కారణం అధికార పదవుల్లో కొనసాగుతున్నటువంటి సామాన్య అధికారులు మొదలుకొని ఉన్నత అధికారుల వరకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు అగ్రవర్ణాల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి ప్రతి వ్యవస్థలో ఉన్నతాధికారి అగ్రవర్ణానికి చెందినవారు అవుతున్నందున వాళ్ళు చెప్పు చేతల్లో అధికార పదవుల్లో కొనసాగుతూ వ్యవస్థల నాశనానికి,సామాజిక వర్గాలను సమూలంగా అణిచివేయడానికి, వ్యవస్థలను దుబారా పాలు చేయడానికి ఎక్కడా వెనుకడం లేదని హెచ్చరించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నడవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలు ఇంతలా దిగజారిపోవడం ఇంతలా అణిచివేయబడడం ఇంతలా స్వార్థాన్ని బలపరుచుకోవడం ఎప్పుడు కనివిని ఎరుగలేమని గుర్తు చేశారు.శాసించినోనిదే సామ్రాజ్యం అనే విధంగా అవినీతి అధికారులు ఎంతటి తప్పులు చేసినా ఎంతటి పొరపాట్లు చేసిన ఇంతటి అరాచక పనులు చేసిన వాళ్లకు ఉండే మర్యాద వేరంటూ హెచ్చరించారు.అధికార వ్యవస్థలలో పాతుకుపోయిన అరాచక శక్తులు వ్యవస్థలను సమూలంగా నాశనం చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారని ప్రధానంగా ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ శాఖలపై కసిని పెంచుకొని వ్యవస్థల నాశనానికి బానిసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని అలాంటివన్నీ ప్రతి ప్రభుత్వ వ్యవస్థలో వ్యవస్థ నాశనానికి వ్యక్తిగత అధికార పదవులతో సంబంధం లేకుండా అధికారిక హోదాలలో బయటకు చేరవేయబడే అధికార ఆర్డర్స్ ప్రతిదీ బలపరచబడుతూ ప్రభుత్వ వ్యవస్థలను పతనవస్థకు చేరువయ్యేలా చేస్తున్నాయన్నారు. రాష్ట్ర సచివాలయం నుండి మొదలుకొని అనేక ప్రభుత్వ శాఖలలో అధికార దుర్వినియోగం జరగడానికి ప్రధాన కారణం బహుజన అధికారులేనని చెప్పకనే చెప్పారు.అగ్రవర్ణాలైనా ఉన్నత అధికారులేమో గుట్టు చప్పుడు కాకుండా సామాన్యులకు రక్షణ కల్పించ లేకుండా వ్యవస్థలపై పట్టు సంపాదించుకొని కిందిస్థాయి అధికారులచే బానిసత్వ పనులు చేయిస్తున్నారని ప్రధానంగా ప్రతి వ్యవస్థలో రహస్య పాలన ఎక్కువగా పెరిగిపోవడానికి అధికార బానిసత్వమే కారణమని అది ప్రతి వ్యవస్థలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుంది అన్నారు.

**వివరాల గోప్యం వింత నాటకం..**

రహస్యం రాటు తేలుతుంది వ్యవస్థలు నాశనమవుతున్నాయని మండిపడ్డారు ప్రతి ప్రభుత్వ వ్యవస్థలో అధికారికంగా సిద్ధపాటు చేయబడుతున్న ఆధారాలన్నీ మటుమాయం చేయబడుతున్నాయని వాటి వల్ల అవినీతి అధికారులు అవినీతికి పాల్పడిన ఆధారాలను మాయం చేస్తూ అవినీతిపై చేయబడుతున్న తప్పులను కప్పిపుచ్చుకోవడమే కాకుండా చర్యల నుండి సునాయాసంగా తప్పించుకోగలుగుతున్నారని పైగా అలాంటి వ్యక్తులే వ్యవస్థలను శాసించే స్థాయికి చేరిపోయి అధికార పదవులను అడ్డం పెట్టుకొని వ్యవస్థల నాశనంలో కీలక పాత్ర వహిస్తున్నారని గుర్తు చేశారు.అధికార బాధ్యతలు చేపడుతున్న ప్రతి బహుజన అధికారులు ప్రజాస్వామ్య విలువల కోసం ప్రభుత్వ వ్యవస్థల రక్షణ కోసం పనిచేయడం అనేది కనిపించడం లేదన్నారు.గతంలో అధికారులకు మానవత్వం మెండుగా ఉండేదని అలాంటి మనస్తత్వం కలిగిన అధికారులు వ్యవస్థలను కాపాడుకోవడానికి నిరంతరం పనిచేసేవారని వ్యవస్థలు బాగుపడితే చాలు అనుకునే అధికారులు చాలా ఎక్కువ మంది ఉంటునందున ప్రభుత్వ వ్యవస్థలో సిద్ధపాటు చేయబడుతున్న ఆధారాలని బహిరంగంగా ప్రజాక్షేత్రంలో ఉంచబడేవని ఎప్పుడైతే అధికార వ్యవస్థలను నాశనం చేయాలనే ప్రయత్నాలు మొదలయ్యాయో అప్పటినుండి వ్యవస్థల నాశనమే కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉంటున్న సాధారణ ప్రజలను నాశనం చేయడానికి కంకణ బద్ధలవుతున్న పై అధికారులు వాళ్ళ అంతర్గత రహస్యమైన మనస్తత్వాలను కార్యాచరణ రూపంలో బయటకు వెళ్లగకుతూ ప్రభుత్వ వ్యవస్థలను ఉన్నత స్థాయిలో పతనం చేస్తున్నారని నిలదీశారు.రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా నశించిపోతుందని పైపైన అభివృద్ధి పేరును వాడుకుంటూ లోలోపల కావలసిన అక్రమ పనులన్నీ చేసి తీరుతున్నారన్నారు.చదువుకునే వారికి విద్య దొరకడం లేదంటూ విద్య దొరికిన వారికి ఉద్యోగం దొరకడం లేదంటూ ఉద్యోగం దొరికిన వారికి మనశ్శాంతి లేకుండా అణిచివేత అనుభవాలు జరుగుతుండగా బహుజన అధికారులందరూ గత్యంతరం లేక, పదవులపై ఆసక్తితో అధికార పదవుల దాహంతో,సొంత వ్యవస్థల నాశనం కోసం వాళ్ల వ్యక్తిగత స్వార్థాలను కనపరుస్తున్నారని మొత్తం మీదుగా అధికార పదవి అనేది బహుజన అధికారులకు బానిసత్వానికి తప్ప దేనికి పనికి పనికిరాదనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు. అగ్రవర్ణాలలో ఆదర్శవంతమైన అధికారులు ఏ వ్యవస్థలోనైతే పనిచేస్తున్నారో ఆ వ్యవస్థలో పనిచేస్తున్న అవినీతి అధికారులను అధికార దుర్వినియోగాలకు పాల్పడుతున్న అధికారులను ప్రభుత్వ అధికార కార్యాలయాలలో ఏర్పాటు చేయబడుతున్న ఆధారాలను మాయం చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షిస్తూ వ్యవస్థల రక్షణకు పాటుపడుతుంటే కిందిస్థాయి అధికారులు మాత్రం వాళ్ళ ఆలోచనలను అందుకోవడంలో సునాయాసంగా వెనుకబడిపోతున్నారని నిందించారు. ఏ అగ్రవర్ణాలైతే ప్రధాన శాఖలలో ఉంటూ వాళ్ల వ్యక్తిగత స్వార్థాలను వ్యవస్థలపై అనువదింపజేయాలనే ఆలోచన కలిగివుండి ప్రతి శాఖలలో క్రింది స్థాయి అధికారులు పై స్థాయి అధికారుల కన్నా ఎక్కువ స్వార్థాన్ని ఎవరికి కనపరుస్తూ రహస్యమైన నాశనాన్ని రాజరికపు పోకడలాగా భావించుకుంటూ అధికార పదవులను కాపాడుకోవడం కోసంపై అధికారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతూ అధికారం అంటే ఇలాగే ఉంటుందేమోనని నేటి సమాజాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.విలువలు లేని అధికారులు అక్రమ మార్గాలతో కూడిన వ్యవస్థలను సిద్ధం చేయడానికి బలమైన శక్తులుగా ఎదుగుతూ ముందుకు సాగుతున్నారని అలాంటి అధికారులందరూ ప్రభుత్వ వ్యవస్థలలో తయారు చేయబడుతున్న ప్రతి ఆధారాన్ని కనుమరుగు చేస్తున్నారని స్పష్టం చేశారు.అధికార వ్యవస్థలు ఇంత దుర్బలంగా తయారు కావడానికి ప్రధాన కారణం ప్రతి ఆదరాన్ని రహస్యంగా దయడమేనని అలా రహస్యంగా దాసే బాధ్యతలను బహుజన వర్గానికి చెందిన అధికారులే ఎక్కువగా తీసుకుంటున్నారని వాటి వల్ల వ్యవస్థల నాశనమే కాకుండా భావితరం భవిష్యత్తు కూడా నాశనం అయిపోతుందని పేర్కొన్నారు.ఒక్కొక్క ప్రభుత్వ ఉన్నత అధికారి ఎంత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందో వాటన్నిటిని మరిచిపోయి ప్రభుత్వాల దగ్గర మెప్పు, రాజకీయ నాయకుల దగ్గర మెప్పు, పై అధికారుల దగ్గర మెప్పు పొందుకోవడం కోసం బానిసత్వాన్ని అయినా భరిస్తున్నారు గాని సామాజిక వర్గాన్ని ప్రజాస్వామ్యాన్ని కాస్తయినా కాపాడలేకపోతున్నారని అన్నారు.మంచి చేయాలనే ఆలోచన అధికారులలో ఏమాత్రం రాకపోవడం వికారం అన్నారు.ప్రభుత్వ వ్యవస్థలలో సిద్ధపాటు చేయబడుతున్న ప్రతి ఆధారం ఎంతలా వెలుగులోనికి వస్తే ప్రభుత్వ వ్యవస్థలకు అంత రక్షణ లభిస్తుందని గుర్తు చేశారు.ప్రభుత్వ వ్యవస్థలను పనిచేస్తున్న ప్రతి అధికారులు బానిసత్వపు సంకెళ్ల నుండి బయటకు వచ్చి ప్రజాస్వామ్య రక్షణ కోసం వ్యవస్థలో భాగోగు కోసం పాటుపడాలని కోరారు.

**రాజకీయ బానిసత్వం రాజీ పడుతుంది.**

రాజకీయ పదవుల కోసం ఆశపడుతున్న ప్రతి ఒక్కరూ రెడ్డి వెలమ సామాజిక వర్గాల మధ్యలో నలిగిపోక తప్పదని హెచ్చరించారు.అధికార పార్టీ రెడ్డి సామాజిక వర్గాన్ని పెంచి పోషిస్తుంటే ప్రతిపక్షం వెలమ సామాజిక వర్గాన్ని పెంచి పోషిస్తుందని రాష్ట్రమంతా విమర్శల వర్షం కురుస్తుండగా రెడ్డి సామాజిక వర్గమైన వెలమ సామాజిక వర్గమైన అధికార పదవులలో కొనసాగుతున్నంతకాలం అధికార పదవి కాలంలో ఉన్నంతకాలం రాష్ట్రానికి గాని రాష్ట్ర ప్రజలకు గాని చేస్తున్న ప్రయోజనాలు మాత్రమే వాళ్ల వ్యక్తిగత జీవితాలను నిలబెడతాయని అదే సందర్భంలో కింది స్థాయి నాయకులను ఏ విధంగా చూస్తున్నారు అనేది రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్న సందర్భంలో రెడ్డి,వెలమ సామ్రాజ్యాలను గుప్పిట్లో పెట్టుకుని రాజకీయాలను శాసిస్తున్నది మాత్రం బ్రాహ్మణ వ్యవస్థ మాత్రమేనని చెప్పక తప్పడం లేదన్నారు.పదుల సంఖ్యలో లేని పెత్తందారులు రాజకీయ నాయకులు ఎదిగి రాజ్యాలను పాలిస్తుంటే వేల సంఖ్యలో ఉన్న బహుజనులు బానిసత్వానికి బానిసలై బలైపోతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా అగ్రవర్ణాల ఆధిపత్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న విమర్శల దాడిని విమర్శల అలజడిని చూసి కాస్తయినా మేల్కొని ప్రజా శ్రేయస్సు కొరకు ముందుకు సాగాలని తెలిపారు.బహుజనులను బానిసలుగా వాడుకొని చివరకు అవమానకరపు స్థితిలో నెట్టివేస్తూ రాజ్యాలను రాజ్యాధికారాలను రాజభోగాలను అనుభవించడానికి వెనుకాడని ఉన్నత వర్గాలన్నీ వ్యక్తిగత ఆత్మవిశ్వాసంలో,వ్యక్తిగత అంతర్మదనంలో పడి బహుజనులను బానిసలకు, బానిసత్వాలకు లోను చేయకుండా తగు జాగ్రత్తలు పడాలని హెచ్చరించారు.ప్రజల్లో మార్పు వస్తున్నందున ప్రజాస్వామ్యంలో పోరాటాలు పెరుగుతున్న సందర్భంలో అహంకార ఆధిపత్యపు జోరు ఉన్నపాటుగా కనుమరుగవ్వడం ఖాయమని హెచ్చరించారు.ప్రభుత్వాలు మారుతున్న రాజకీయ అధికార జోరు మాత్రం తగ్గడం లేదని బహుజనులంతా రాజకీయ ఉచ్చులో పడి రాజకీయ మాయలో పడి రాజకీయ అధికార పదవుల దాహార్తిపై మక్కువ పెంచుకొని ప్రతి చోట రాజీపడుతూ ఉంటున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర రక్షణ కోసం పాటుదామన్న సోయి ఎవరికీ లేకుండా పోతుందన్నారు.ప్రతి చోట ప్రతి సమయంలో ఉన్నత స్థాయి నాయకులను పొగిడితే తప్ప రాజకీయ బతుకు ఉండదని భావిస్తున్న ప్రతి ఒక్కడు సమాజం దృష్టిలో బానిసత్వపు బ్రతుకుకు అలవాటు పడిన వాడేనని గుర్తు చేస్తూ నిజాయితీగా పని చేసేవాడు పొగరుతో జీవించాలి గానీ బానిసత్వంతో కాదనేది మరొకసారి గుర్తుంచుకోవాలని తెలుపుతూ రాష్ట్రంలో బహుజను బానిసత్వానికి అలవాటు పడి బానిసలుగా జీవిస్తున్నంతకాలం బహుజన వాదం,బహుజన రాజ్యం బానిసత్వానికి తలోగ్గాల్సిందే అంటూ మరొకసారి గుర్తు చేశారు.

# కేబుల్ టీవీ అక్రెడిటేషన్లపై అనుమానాల మేఘం.. అసలు లెక్కలేంటి?

**అక్రెడిటేషన్ వెనుక అసలు కథేంటి?**
**గత లెక్కలెంత.. తాజా గుర్తింపులెన్నింటికి?**
**అర్హతలు, పత్రాల పరిశీలన జరిగిందా?**
**డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్**
**ఎవరు పరిశీలించారు.. ఎవరు సిఫార్సు చేశారు.. ఎవరు ఆమోదించారు?**

**హైదరాబాద్, అక్టోబర్ 4, 2026 (జై భీమ్ న్యూస్):**

కేబుల్ న్యూస్ ఛానళ్లకు మంజూరు చేసిన అక్రెడిటేషన్ల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అక్రెడిటేషన్ మంజూరు ప్రక్రియలో నిబంధనలు పూర్తిగా పాటించారా? అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలకే గుర్తింపు ఇచ్చారా? దరఖాస్తులను ఏ ప్రాతిపదికన పరిశీలించారు? గతంలో అక్రెడిటేషన్ పొందని వ్యక్తులు, సంస్థలకు ప్రస్తుతం ఏ నిబంధనల ప్రకారం గుర్తింపు మంజూరు చేశారు? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అక్రెడిటేషన్ అనేది మీడియా సంస్థలు, జర్నలిస్టులకు అధికారిక గుర్తింపు కల్పించే ప్రక్రియ కావడంతో ఇందులో పారదర్శకత, అర్హతల పరిశీలన, నిబంధనల అమలు కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో అక్రెడిటేషన్ పొందిన కేబుల్ న్యూస్ ఛానళ్లు ఎన్ని? ప్రస్తుతం ఎన్ని ఛానళ్లకు అక్రెడిటేషన్లు మంజూరయ్యాయి? గతంతో పోలిస్తే తాజాగా ఎన్ని కొత్త గుర్తింపులు ఇచ్చారు? గతంలో గుర్తింపు పొందని వ్యక్తులు, సంస్థలకు ప్రస్తుతం ఏ ప్రాతిపదికన అక్రెడిటేషన్ మంజూరు చేశారు? ఎవరెవరి దరఖాస్తులు ఆమోదించారు? ఎవరెవరి దరఖాస్తులు తిరస్కరించారు? తిరస్కరించిన దరఖాస్తులను తిరిగి పునఃపరిశీలించారా? అనే వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ వినిపిస్తోంది. అక్రెడిటేషన్ పొందిన ప్రతి ఛానల్, ప్రతి వ్యక్తికి సంబంధించిన అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలించారా? దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలు వాస్తవమా? ఛానళ్లు వాస్తవంగా ఎక్కడి నుంచి ప్రసారం అవుతున్నాయి? వాటి కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతున్నాయా? అక్రెడిటేషన్ కోసం సమర్పించిన పత్రాలు, ఛానల్ నిర్వహణ వివరాలు, కార్యాలయ చిరునామా, సిబ్బంది, ప్రసార వ్యవస్థ, సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలను అధికారులు పూర్తిగా పరిశీలించారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. అదేవిధంగా ప్రతి దరఖాస్తును ఎవరు పరిశీలించారు? ఎవరు సిఫార్సు చేశారు? తుది ఆమోదం ఏ స్థాయిలో జరిగింది? ఏ నిబంధనల ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? ప్రతి అక్రెడిటేషన్‌కు సంబంధించిన ఫైల్ నోట్, పరిశీలన నివేదిక, సిఫార్సు, ఆమోద ప్రక్రియ రికార్డుల్లో ఉన్నాయా? అనే అంశాలపైనా స్పష్టత అవసరమని పలువురు కోరుతున్నారు. ఇదే సమయంలో అక్రెడిటేషన్ల మంజూరు వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లేదా తప్పుడు మార్గాల ద్వారా కొందరికి అక్రెడిటేషన్లు ఇప్పించారన్న ఆరోపణలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఇవి ప్రస్తుతం ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయని, వాటి వాస్తవికత అధికారిక విచారణలోనే తేలాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించి ప్రజల్లో ఉన్న అనుమానాలకు తెరదించాలని పలువురు కోరుతున్నారు. అక్రెడిటేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి గతంలో ఎన్ని కేబుల్ న్యూస్ ఛానళ్లు ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి, కొత్తగా ఎన్ని అక్రెడిటేషన్లు మంజూరయ్యాయి, ఎవరెవరికి గుర్తింపు లభించింది, వారి అర్హతలు ఏమిటి, ఏ నిబంధనల ప్రకారం గుర్తింపు ఇచ్చారు, దరఖాస్తులను ఎవరు పరిశీలించారు, ఎవరు సిఫార్సు చేశారు, తుది ఆమోదం ఎవరు ఇచ్చారు, ఏ ఆధారాలపై అక్రెడిటేషన్లు మంజూరు చేశారు అనే వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. విచారణలో తప్పుడు సమాచారం సమర్పించినట్లు, నకిలీ లేదా చెల్లని పత్రాలను ఉపయోగించినట్లు, అర్హతలను తప్పుగా చూపించినట్లు లేదా నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులు, సంస్థలు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రెడిటేషన్ మంజూరైనట్లు తేలితే వాటిని పునఃపరిశీలించి, అవసరమైతే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే కొందరిపై వచ్చిన ఆరోపణల కారణంగా మొత్తం కేబుల్ న్యూస్ ఛానళ్ల వ్యవస్థకు మచ్చ రాకుండా చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా, అర్హతతో పనిచేస్తున్న మీడియా సంస్థలు, జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అక్రెడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు. ఆధారాలతో నిజానిజాలను వెలుగులోకి తీసుకురానున్న జై భీమ్: కేబుల్ న్యూస్ ఛానళ్ల అక్రెడిటేషన్ వ్యవహారంపై వస్తున్న ప్రశ్నలు, అనుమానాలు, ఆరోపణల వెనుక అసలు వాస్తవాలు ఏమిటి? గతంలో ఎన్ని అక్రెడిటేషన్లు ఉన్నాయి? ప్రస్తుతం ఎన్ని మంజూరు చేశారు? కొత్తగా ఎవరెవరు గుర్తింపు పొందారు? ఏ నిబంధనల ప్రకారం వారికి అక్రెడిటేషన్ ఇచ్చారు? దరఖాస్తులను ఎవరు పరిశీలించారు? ఎవరు సిఫార్సు చేశారు? ఏ ఆధారాలపై నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలపై అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం, నిబంధనలు, రికార్డులు, సంబంధిత పత్రాలను పరిశీలించి ఆధారాలతో నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావడానికి జై భీమ్ టీవీ ప్రత్యేక పరిశోధనాత్మక కథనాన్ని సిద్ధం చేస్తోంది. ఎవరికీ భయపడకుండా, ఎవరినీ ముందుగానే దోషిగా తేల్చకుండా, ఆధారాలు ఏమి చెబుతున్నాయో అదే ప్రజల ముందుంచుతామని జై భీమ్ టీవీ పేర్కొంది. కేబుల్ టీవీ అక్రెడిటేషన్ల అసలు లెక్కలు ఏమిటి? ఎవరికి ఎలా గుర్తింపు లభించింది? అర్హతలు, పత్రాల పరిశీలన జరిగిందా? నిబంధనలు పాటించారా? ఆరోపణల్లో వాస్తవమెంత? అక్రెడిటేషన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకత ఎంత? అనే అంశాలపై అధికారిక సమాచారం, రికార్డులు, ఆధారాల ఆధారంగా నిజానిజాలను వెలుగులోకి తీసుకురానున్నట్లు తెలిపింది.



# ఆర్టీఐ యాక్ట్ రాష్ట్రస్థాయి కార్యక్రమానికి గవర్నర్‌కు ఆహ్వానం

**గవర్నర్ ప్రతాప్ శుక్లాను కలిసిన రాష్ట్ర సమాచార కమిషనర్లు**
**అక్టోబర్ 9న రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి కార్యక్రమం**
**సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహణ**
**సమాచార హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం**
**పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే దిశగా కార్యక్రమం**



**హైదరాబాద్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**

రాష్ట్ర సమాచార కమిషనర్లు గవర్నర్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసి, అక్టోబర్ 9న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. అక్టోబర్ 9న సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచార కమిషనర్లు గవర్నర్‌కు వివరించారు. సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, ప్రజలకు సమాచార హక్కుపై మరింత అవగాహన కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను గవర్నర్‌కు తెలియజేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లు, కార్యక్రమంలో పాల్గొని సందేశం అందించాలని కోరుతూ ఆహ్వానం అందజేశారు.

# సింగీతం శ్రీనివాసరావు మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**హైద్రాబాద్, 4 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**



ప్రముఖ సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వైవిధ్యభరితమైన కథాంశాలను, వినూత్నమైన ఆలోచనలను వెండితెరపై ఆవిష్కరిస్తూ తెలుగు సినిమాకు కొత్త దారులు చూపిన సృజనాత్మక దర్శకుడిగా సింగీతం శ్రీనివాసరావును సీఎం స్మరించుకున్నారు. ప్రయోగాత్మకతకు పెద్దపీట వేస్తూ ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించిన ఆయన తనదైన ముద్రను సినీ చరిత్రలో శాశ్వతంగా నిలిపారని అన్నారు. దర్శకుడిగానే కాకుండా రచయితగా, ఆలోచనాపరుడిగా, సినిమాపై అపారమైన ప్రేమతో పనిచేసిన కళాకారుడిగా సింగీతం శ్రీనివాసరావు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సినీ కళాభిమానులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కేయూసీఈటీ విద్యార్థుల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్కింగ్‌లో ప్రతిభ

**హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు**
**పారిశ్రామికవేత్తలు, మెంటర్లతో ముఖాముఖి చర్చలు**
**స్టార్టప్‌లు, వ్యాపార అవకాశాలపై అవగాహన**
**నూతన ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడంపై సూచనలు**
**విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం పెంపొందుతుందన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ**

**కేయూ క్యాంపస్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**




కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (కేయూసీఈటీ) విద్యార్థులు హైదరాబాద్ రాయదుర్గ్‌లో ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ (ఈబీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నెట్ వర్కింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేయూసీఈటీకి చెందిన మొదటి సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు డి. హేమంత్, టి. సిద్ధార్థ్, సిద్ధి కుమారి కార్యక్రమంలో పాల్గొని పలువురు పారిశ్రామికవేత్తలు, మెంటర్లతో ముఖాముఖి చర్చలు నిర్వహించారు. సుమారు 30 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వ్యాపార అవకాశాలు, స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, నూతన వ్యాపార ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీ కాళీ ప్రసాద్ గదిరాజు, శ్రీ సుబ్బరాజు పెరిచెర్ల తదితర పారిశ్రామికవేత్తలతో విద్యార్థులు సంభాషించి వ్యాపార రంగంలోని అవకాశాలు, సవాళ్లు, అవసరమైన నైపుణ్యాలపై వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనలు, వ్యాపార దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని కేయూసీఈటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

# ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

## కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



**హన్మకొండ, 4 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం హనుమకొండ స్థానిక డిపోలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.డబ్ల్యు.యూ., ఎస్.డబ్ల్యు.ఎఫ్., ఐ.ఎన్.టి.యు.సి. ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయడంతో పాటు సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. కార్మికుల ఐక్యత, సంక్షేమం కోసం పనిచేస్తున్న టి.డబ్ల్యు.యూ., ఎస్.డబ్ల్యు.ఎఫ్., ఐ.ఎన్.టి.యు.సి. ఐక్య కూటమికి ఎన్నికల్లో మద్దతు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు.. ఎవరి నిర్ణయం?

**ఇన్‌చార్జి బాధ్యతల కేటాయింపుపై ఉద్యోగుల్లో చర్చ**
**సీనియారిటీ, అర్హత, అనుభవం పాటించారా?**
**గతంలో పనితీరుపై అభ్యంతరాలున్నాయన్న ప్రచారం**
**'రాజీ ఎవరి మధ్య?'.. 'ప్రతి పోస్టుకు ఓ రేటు' అంటూ చర్చ**
**ఉత్తర్వులు, నిబంధనలు బహిర్గతం చేయాలని ఉద్యోగుల డిమాండ్**

**మున్సిపల్ కార్పొరేషన్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి బాధ్యతల కేటాయింపు వ్యవహారం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్ అసిస్టెంట్లలో జూనియర్ ఉద్యోగికి సూపరింటెండెంట్ స్థాయి ఇన్‌చార్జి బాధ్యతలు ఎలా అప్పగించారనే సందేహాలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయంలో సీనియారిటీ, అర్హత, అనుభవం, పనితీరు, శాఖాపరమైన నిబంధనలు పాటించారా అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు పొందిన ఉద్యోగి గతంలో ఆర్ఐగా పనిచేసిన సమయంలో ఆయన పనితీరుపై అప్పటి కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేసి వేరే శాఖకు పంపినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, రికార్డులు వెలుగులోకి రావాల్సి ఉంది. ఇన్‌చార్జి బాధ్యతల కేటాయింపుపై 'రాజీ ఎవరి మధ్య?', 'ప్రతి పోస్టుకు ఓ రేటు' వంటి ప్రచారాలు కూడా ఉద్యోగుల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ప్రస్తుతం అధికారిక ఆధారాలు లేవు. కొందరు సీనియర్ ఉద్యోగులు పైఅధికారులను కలిసి తమ అభ్యంతరాలను వివరించినప్పటికీ న్యాయం జరగలేదని వాపోతున్నట్లు సమాచారం. సీనియారిటీ, అర్హత, అనుభవం ఆధారంగానే బాధ్యతలు కేటాయించారా? లేక ఇతర ప్రమాణాలు పనిచేశాయా? అనే అంశంపై బల్దియా ఉన్నతాధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు. బాధ్యతల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు, వర్తించే నిబంధనలను పారదర్శకంగా వెల్లడిస్తే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్

**కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారి దర్శనం**
**ప్రత్యేక పూజలు నిర్వహించిన వి.పి. గౌతమ్, ఐఏఎస్**
**ఆలయ అర్చకులు, అధికారుల ఘన స్వాగతం**
**పూజల అనంతరం మహదాశీర్వచనం**
**శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు**



**వరంగల్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**

వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ ఆదివారం సాయంత్రం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వి.పి. గౌతమ్‌కు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను వి.పి. గౌతమ్, ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి కార్యక్రమం

**జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో అర్జీల స్వీకరణ**
**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం**
**హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో నిర్వహణ**
**మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లోనూ అర్జీల స్వీకరణ**
**ప్రజలు సమస్యలపై అర్జీలతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచన**

**హన్మకొండ, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**




ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలుతో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**నర్సంపేటలో 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు**
**జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కె. మనోహర్**



**నర్సంపేట, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్)**

తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ అధికారిక ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు కె. మనోహర్ తెలిపారు. వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ధ్రువీకరణ ముద్రలు వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తూకాలు, కొలతలను పరిశీలించాలని, తూకాల్లో మోసం జరిగినట్లు అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# ప్రపంచకప్‌కు ముందు అదే టెన్షన్..

**ఆ రెండు విభాగాల్లో వీక్ అన్న కెప్టెన్ గిల్**
**వెస్టిండీస్‌పై సిరీస్ గెలిచినా లోపాలపై గిల్ దృష్టి**
**ఫీల్డింగ్, డెత్ ఓవర్ల బౌలింగ్‌లో మెరుగుపడాల్సిందే**
**సిరీస్‌లో ఆరు, ఏడు క్యాచ్‌లు జారవిడవడంపై అసంతృప్తి**
**స్లో ఓవర్ రేట్‌తో డెత్ ఓవర్లలో ప్రతికూల పరిస్థితులు**
**ప్రపంచకప్‌కు ముందు ఫీల్డింగ్ అత్యున్నత స్థాయిలో ఉండాలని స్పష్టీకరణ**



**స్పోర్ట్స్ డెస్క్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**

వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు 2–1 తేడాతో కైవసం చేసుకున్నప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు పూర్తి సంతృప్తి కలగలేదు. ముఖ్యంగా ఫీల్డింగ్, డెత్ ఓవర్ల బౌలింగ్ విభాగాల్లో జట్టు ఇంకా మెరుగుపడాల్సి ఉందని గిల్ స్పష్టం చేశాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన మూడో, చివరి వన్డేలో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ అనంతరం ప్రజెంటేషన్ కార్యక్రమంలో గిల్ మాట్లాడుతూ సిరీస్‌లో చాలా విషయాలు తమకు అనుకూలంగా జరిగాయని, అయితే కొన్ని అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపాడు. మూడో వన్డేలో భారత్ 351 పరుగులు చేయడం మంచి స్కోరేనని, చాలా సేపటి వరకు మ్యాచ్ తమ నియంత్రణలోనే ఉందని, అయితే చివరి దశలో వెస్టిండీస్ అద్భుతంగా ఆడి మ్యాచ్‌ను తమ నుంచి లాగేసుకుందని పేర్కొన్నాడు. స్లో ఓవర్ రేట్ కూడా జట్టును దెబ్బతీసిందని, నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు వెనుకబడి ఉండటంతో డెత్ ఓవర్లలో ఫీల్డింగ్ నిబంధనలు ప్రతికూలంగా మారాయని వివరించాడు. ప్రత్యర్థి జట్టు ఐదారు వికెట్లు కోల్పోయినప్పుడు అటాకింగ్ బౌలింగ్ వేయాలా? లేక పరుగులు కట్టడి చేస్తూ డిఫెన్సివ్‌గా ఆడాలా? అనే వ్యూహంపై కొన్నిసార్లు అనిశ్చితి నెలకొంటోందని గిల్ అభిప్రాయపడ్డాడు. ఈ విషయంలో మరింత స్పష్టత అవసరమని సూచించాడు. అన్నింటికంటే ముఖ్యంగా ఫీల్డింగ్‌పై గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ మొత్తంలో తమ ఫీల్డర్లు సుమారు ఆరు నుంచి ఏడు క్యాచ్‌లు జారవిడిచారని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నాడు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీకి ముందు ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. జట్టు పురోగతిపై తాను సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, ఫీల్డింగ్ అత్యున్నత స్థాయిలో ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని కెప్టెన్ గిల్ స్పష్టం చేశాడు.

# ప్రేమ పేరుతో మోసం.. యువతి సంచలన ఆరోపణలు

**మూడు సార్లు అబార్షన్ చేయించారంటూ యువతి ఆరోపణ**
**వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ కుమారుడిపై ఆరోపణలు**
**పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని బాధితురాలి వాదన**
**ఎమ్మెల్యేను కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన**
**నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకోలు**




**వర్ధన్నపేట, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్):**

ప్రేమ పేరుతో తనను నమ్మించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశారని ఓ దళిత యువతి ఆరోపించింది. తనకు మూడుసార్లు అబార్షన్ చేయించారని, ప్రస్తుతం పెళ్లి చేసుకోవాలని కోరుతున్నప్పటికీ న్యాయం జరగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి వాదన ప్రకారం.. వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ కుమారుడు శ్రీకాంత్ తనను ప్రేమ పేరుతో నమ్మించాడని, అనంతరం తనతో సన్నిహితంగా మెలిగాడని ఆరోపించింది. ఈ క్రమంలో తాను గర్భం దాల్చిన సందర్భాల్లో మూడుసార్లు అబార్షన్ చేయించారని ఆమె పేర్కొంది. చివరకు తనను పెళ్లి చేసుకోవాలని కోరగా స్పందించకుండా, తనకు న్యాయం జరగదన్నట్టుగా వ్యవహరించారని ఆమె ఆరోపించింది. ఈ వ్యవహారంపై తాను ఇప్పటికే వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును కలిసి న్యాయం చేయాలని కోరినట్లు బాధితురాలు తెలిపింది. అయినప్పటికీ ఇప్పటివరకు తన సమస్యకు పరిష్కారం లభించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు వదిలివేయడం అన్యాయమని పేర్కొంటూ, తనకు జరిగిన విషయంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది. ఈ ఘటనపై దళిత సంఘాలు స్పందించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఇంటి ఎదుట టెంట్ వేసి ఆందోళన చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత మున్సిపల్ చైర్మన్ కుటుంబం, శ్రీకాంత్ లేదా ఇతర సంబంధిత వ్యక్తుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణల నిజానిజాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఒక యువతి తనకు న్యాయం చేయాలని కోరుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బాధితురాలు దళిత యువతి కావడంతో దళిత సంఘాలు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. అధికారం, రాజకీయ పలుకుబడి లేదా సామాజిక ప్రభావం ఉన్నవారిపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. బాధితురాలి ఫిర్యాదును పూర్తిగా నమోదు చేసి, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

# జాన్వీ మార్ఫింగ్ వీడియోపై కుష్బూ ఫైర్.. 'ఇది సిగ్గుచేటైన చర్య'

**'చుట్టమల్లె' పాటను మార్ఫింగ్ చేసి వైరల్ చేయడంపై ఆగ్రహం**
**మహిళల గౌరవాన్ని కించపరిచే చర్యగా అభివర్ణన**
**వీడియోలు సృష్టించే, షేర్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**ఏఐ టెక్నాలజీని మహిళలపై ఆయుధంగా మార్చొద్దని పిలుపు**
**జాన్వీకి అండగా ఉంటానంటూ కుష్బూ భరోసా**



**ఎంటర్‌టైన్‌మెంట్ డెస్క్, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్):**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ నటి జాన్వీ కపూర్‌కు సంబంధించిన మార్ఫింగ్ వీడియోను సృష్టించడంపై సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు కుష్బూ సుందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లె' పాటను మార్ఫింగ్ చేసి వైరల్ చేయడంపై స్పందించిన ఆమె.. ఇది వినోదం కాదని, ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించే సిగ్గుచేటైన చర్య అని పేర్కొన్నారు. ఈ ఘటనపై తన ఎక్స్ ఖాతాలో స్పందించిన కుష్బూ.. ఏఐ ద్వారా రూపొందించిన ఇలాంటి కంటెంట్‌ను జోక్‌గా లేదా సాధారణ విషయంగా చూడకూడదని, ఇది క్రూరమైన, అవమానకరమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి మార్ఫింగ్ వీడియోలు సృష్టించడం, వాటిని ప్రచారం చేయడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి మహిళల గౌరవానికి, భద్రతకు భంగం కలిగించే పరిస్థితులు ఉండకూడదని, ఒక మహిళపై ఇలాంటి దాడి జరిగినప్పుడు మిగతా మహిళలు మౌనంగా ఉండకూడదని పిలుపునిచ్చారు. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించే వారితో పాటు తెలిసి కూడా వాటిని షేర్ చేసేవారిని, ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళ శరీరం వినోద వస్తువు కాదని, ఆమె గౌరవం ఆటబొమ్మ కాదని, ఏఐ టెక్నాలజీ మహిళలపై ఆయుధంగా మారకూడదని స్పష్టం చేశారు. చివరగా జాన్వీ కపూర్‌కు తాను అండగా ఉన్నానని, ధైర్యంగా ఉండాలని కుష్బూ భరోసా ఇచ్చారు. ఇదే అంశంపై జూనియర్ ఎన్టీఆర్ కూడా స్పందించి, ఏఐ టెక్నాలజీతో ఫేక్ వీడియోలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఇలాంటి వీడియోలను ప్రచారం చేసే వారికి కూడా పరిణామాలు ఉంటాయని ఆయన స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు మెగాస్టార్ చిరంజీవి, విజయ్ దేవరకొండ కూడా సోషల్ మీడియా వేదికగా ఈ ఘటనను ఖండించినట్లు సమాచారం.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఢదే హేమంత్ సహదేవరావు**

**ములుగు, అక్టోబర్ 4 (జై భీమ్ న్యూస్)**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఢదే హేమంత్ సహదేవరావు కోరారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే ములుగు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్డీవోలు, మండల స్థాయిలో సంబంధిత అధికారులు ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి అందే దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.